క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు మహిళా ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన సర్టిఫికెట్ పొంది ఉండి 18 నుంచి 44 సంవత్సరాలోపు గల మహిళలు అర్హులని తెలిపారు. జూలై 13వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేసుకోవాలని సూచించారు. అర్హత పరీక్ష, టీడబ్ల్యూడీలో అనుభవానికి వెయిటేజీ ఉంటుందని, రూ.22వేల750 వేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9000099456 సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందగా జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాశిందేవిపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మైనారిటీసెల్ మండల అధ్యక్షుడు రాజాహుస్సేన్ తండ్రి అంకూష్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ, జోసఫ్‌రెడ్డి, మల్లికార్జున్, శ్యామల్ నాయక్, అజార్, సర్పంచ్ అహ్మద్‌పాషా, స్వరూప తదితరులు ఉన్నారు.

లక్ష్మణ్‌బాబును నియమించాలి

ఏటూరునాగారం: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఏటూరునాగారం గ్రామానికి చెందిన కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు (లక్ష్మణ్‌బాబు)ను నియమించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు వలిబాబా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పార్టీ బలోపేతం, ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే వ్యక్తి లక్ష్మీనర్సింహారావు అన్నారు.

ఇంటింటా ప్రచారం



వెంకటాపురం(కె): మండలంలోని బెస్తగూడెంలో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎంపీపీ చెరుకూరి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. ఉపాధి హామీ పథకం పనులు, డంపింగ్ యార్డులు, వైకుంఠదామాలు, హరితహారం, రైతు వేదికలు, రైతులకు సబ్సిడీపై డ్రిప్ పైపులు వంటి అనేక పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, మహేష్, రవీందర్, పోతురాజు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: వర్షాకాలం సమయంలో వచ్చే సీజనల్ వ్యాధులు వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కోటి నాగిరెడ్డి సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కూలర్లు, గోళాల్లో నీటిని నిల్వా ఉంచవద్దని సూచించారు. ఈ కార్య క్రమంలో వైద్య సిబ్బంది శేఖర్, చిన్న వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

ఏటూరునాగారం: జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న దొడ్డి కొమురయ్య విగ్రహ గద్దెను కూల్చిన వారిపై చర్య తీసుకోవాలని కురుమ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తుంటే విగ్రహం ఏర్పాటుకు నిర్మించిన గద్దెను కూల్చివేయడం హేయమైన చర్య అన్నారు.

జారిపోతున్న కరకట్ట రాళ్లు..



తేలికపాటి వర్షానికి జారిపోతున్న రామన్నగూడెం వద్ద గోదావరి కరకట్ట రాళ్లు

ఏటూరునాగారం: గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు గోదావరి వరద ఉగ్రరూపం దాల్చి ఏజెన్సీని అతలాకుతలం చేసింది. ఈ క్రమంలో ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం గోదావరి నది కరకట్ట కోతకు గురైన విషయం తెలిసిందే. కరకట్ట మరమ్మతకు తక్షణ సాయం కింద ఇరిగేషన్ శాఖ రూ. 4 కోట్లను మంజూరు చేసి వెంటనే మరమ్మతులను ప్రారంభించింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ తుపాకులగూడెంలో బాంబులతో పగలగొట్టిన రాయిని కరకట్ట మరమ్మతు పనులకు ఉపయోగించి, మట్టిపోసి రాళ్లను అమర్చారు. అయితే ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు రాయి కాస్తా జారిపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. కరకట్ట మరమ్మతు పనుల్లో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న తేలికపాటి వర్షాలకే కరకట్ట రాళ్లు జారిపోవడంతో వరదలు మరింత ఎక్కువైతే రాయితో పాటు పోసిన మట్టి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయాలు వెచ్చించి పనులు చేపట్టినా నాణ్యత లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సంబంధితశాఖ అధికారులు పనులు పట్టించుకోవాలన్నారు. ఈ ఏడాది కురిసే వర్షానికి గోదావరి ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని అన్నారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు పూర్తి పర్యవేక్షణ చేసి కరకట్ట పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న తీగల ఆగిరెడ్డి

ములుగు రూరల్: ఖరీఫ్ సీజన్ పంటసాగులో కొన్ని రకాల విత్తనాలు మాత్రమే విత్తాలని వాటిని మాత్రమే కొనుగోలు చేస్తామని రైస్‌మిల్లర్లు ప్రకటించడంతో రైతుల్లో గందరగోళం నెలకొందని సీపీఎం మండల కార్యదర్శి తీగల ఆగిరెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం గోవిందరావుపేట మండలం పస్రాలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంట సాగు విషయమై వ్యవసాయ అధికారులను సంప్రదించామన్నారు. స్వర్ణక్రాస్, 1318, 1001, రకాలను ప్రభుత్వం నిషేధించలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పుతున్నప్పటికీ రైస్‌మిల్లర్లు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మిల్లర్లకు ధాన్యం కొనుగోలుకు ఎలాంటి సంబంధం లేదని, ఆధిపత్యం చెలాయించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి నాగరాజు, చిట్టిబాబు, మల్లారెడ్డి, స్వామి, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దామోదరస్వామి

ఏటూరునాగారం: మంగపేట మండలం ఓడగూడెం గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు వాసం లింగయ్య మే 9న గుండెపోటుతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అతని భార్య వాసం భవాని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు ఐటీడీఏ పీఓ అంకిత్ ట్రైబల్ రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ. 25వేలు మంజూరు చేశారు. ఆ చెక్కును మంగళవారం ఐటీడీఏ ఏఓ దామోదరస్వామి బాధితురాలికి అందించారు.

భారీ వర్షానికి కూలిన ఇంటి పైకప్పు



భారీ వర్షానికి కూలిన ఇంటి పైకప్పులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన మాదిరెడ్డి లక్ష్మి ఇంటి పైకప్పు సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. భారీ వర్షంతో పాటు ఇదురుగాలులు వీచడంతో ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలిపోయిందని, అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బయటికి పరుగులు తీసినట్లు బాధితులు తెలిపారు. ఇంట్లోని వంట సామాగ్రి, నిత్యావసర సరుకులు పూర్తిగా ధ్వంసమయ్యాయని వాపోయింది. సుమారుగా రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు

వెంకటాపురం(కె): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కట్ల నర్సింహాచారి అన్నారు. మండలంలోని 18 గ్రామపంచాయతీల కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంపీడీఓ బాబుకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ. 19 వేలు అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చాలని, లేని పక్షంలో సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంజిత్, తాటి శ్రీను, సుంద్రావ్, ఆంజనేయులు, నరేష్, సందీప్, నాగేంద్ర, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండలంలోని చొక్కాల ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించినట్లు ఎదిరా వైద్యాధికారి భవ్యశ్రీ మంగళవారం తెలిపారు. సందర్భంగా 97 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి రక్త నమూనాలను సేకరించామన్నారు. సేకరించిన రక్త నమూనాలను ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు వెల్లడించారు. వైద్య సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మహాముత్తారం: గ్రామ పంచాయతీల భవన నిర్మాణాల పనులను వెంటనే ప్రారంభించాలని మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు సర్పంచ్‌లను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని కొర్లకుంట, వజినేపల్లి, పోలారం, మహబూబ్‌పల్లి, నిమ్మగూడెం, సింగంపల్లి, స్థంబంపల్లి(పీకే), సింగారం గ్రామ పంచాయతీలకు ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిర్మాణాలు ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఆర్‌డీఈ శేష గిరిరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..



కన్నాయిగూడెం: మండలంలోని గుర్రేవుల గ్రామంలో గల రోడ్డు కొద్దిపాటి వర్షానికే బురదయంగా మారింది. కాలినడకకు కూడా వేరే దారిలేకపోవడంతో ప్రజలు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వృద్ధులు, చిన్నపిల్లలు, ద్విచక్రవాహనాదాలు బురదలో జారిపడే ప్రమాదం ఉందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఇటీవల చేపట్టిన రోడ్డు మరమ్మతులో మొరంకు బదులు మట్టి పోయడంతో చిన్నపాటి వర్షానికి బుదర అవుతుందని ప్రజలు ఆరోపించారు. సంబంధితశాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపట్టారని ఆరోపించారు. వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతు.మరమ్మతులు చేపట్టాలని కోరారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



మహిళలతో మాట్లాడుతున్న ఏపీఓ సునీత

పలిమెల: స్వశక్తి సంఘ మహిళలు ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సునీత అన్నారు. మండలంలోని పంకెన గ్రామంలో స్వశక్తి సంఘ మహిళలలు ఉపాధిహామీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు చేసిన పనికి 15 రోజుల లోపే డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. మీరు చేసుకునే పనులతో పాటు ఉపాధిహామీ పనులు చేసుకోవడం వల్ల అదనపు సంపాదన సంపాదించుకోచ్చన్నారు. కాగా గ్రామంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఉపాధిహామీ పనులు వినియోగించుకోవాలని కోరారు.

వివరాల సేకరణ

గొత్తికోయలు జాబ్ కార్డులు కావాలని అడగగా మండలంలోని గొత్తికోయగూడెంలో మంగళవారం ఏపీఓ సునీత సిబ్బందితో కలిసి వారి వివరాలు సేకరించారు. అర్హులైన వారికి త్వరలో జాబ్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ ప్రశాంత్ పాల్గొన్నారు.

స్కూల్ ఫీజుల్లో రాయితీ కల్పించాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజు రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు కలెక్టర్ భవేష్‌మిశ్రా, జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్‌లకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. జిల్లాలోని 11 మండలాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

చిన్నారులకు చేయూత



చిన్నారులతో మాట్లాడుతున్న తస్లీమా

ములుగు రూరల్: మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన శానవేని కర్ణాకర్, కవిత దంపతులు ఇటీవల మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న ములుగు, భూపాలపల్లి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్వర్ చారిట్రబుల్ ట్రస్టు ద్వారా రూ. 2వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందించారు. చిన్నారులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

జిల్లాలో రైస్‌మిల్లర్లదే రాజ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

ఏటూరునాగారం: జిల్లాలోని రైతులు ఏ రకం వరిధాన్యం సాగు చేయాలన్నా రైస్‌మిల్లర్ల పర్మిషన్ తీసుకునే పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు ఏ రకం ధాన్యం సాగు చేయాలో ప్రభుత్వం చెప్పికపోయిన రైస్ మిల్లర్లు మాత్రం రైతులకు హుకూం జారీ చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మిల్లర్లదే రాజ్యం నడుస్తుందని, జిల్లా, మండల అధికారులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. 1318, 1271 రకం వరి నార్లు పోసుకున్నరని మిలర్లు తమకు ఇష్టం వచ్చినట్లు చెప్పి రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు చొరవ తీసుకొని ఏ రకం వరిధాన్యం సాగు చేయాలో రైతులకు సూచించాలన్నారు. మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బాలరాజు, ఎంపీటీసీ శ్రీలత, జిల్లా మైనారిటీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, సులేమాన్, గౌస్, రవి, శ్రీనివాస్, లాలయ్య పాల్గొన్నారు.

తెలంగాణ సొమ్మును తరలిస్తున్న కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న చిటమట రఘు

ఏటూరునాగారం: రాష్ట్రంలోని ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తుంటే సీఎం కేసీఆర్ మాత్రం మన సొమ్మును ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని అన్నారు. ప్రత్యేక బస్సుతో పాటు 600 కార్ల భారీ కాన్వాయ్‌తో సీఎం కేసీఆర్ మహారాష్ట్రకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చుతున్నారని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, ఖలీల్, ఆయూబ్, నర్సింగరావు, లాలయ్య, సులేమాన్, శ్రీను, గౌస్, రవి, బాలరాజు, దేవేందర్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

ములుగు రూరల్: ఐసీడీఎస్‌కు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జీపుజాత కార్యక్రమం మంగళవారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల నుంచి అంగన్‌వాడీ సమస్యలు తీర్చలేదన్నారు. గతంలో వంద శాతం ఉన్న బడ్జెట్‌ను 60శాతానికి తగ్గించి వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం అంగన్‌వాడీలను స్కీం వర్కర్‌లుగా గుర్తించి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్, నర్సింహాచారి, బోడ రమేష్, అంగన్వాడీ జిల్లా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సరోజన, సమ్మక్క, ప్రేమకుమారి, వెంకటరమణ, స్వరూప, రత్నకుమారి, జమున రాణి, దయంతి, విజయలక్ష్మీ, సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం కోసం వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు



మాట్లాడుతున్న సీఐ

ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు తక్షణ వైద్యం కల్పించేందుకు వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు సీఐ రాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లోగాయపడిన వారిని రక్షించేందుకు రోడ్ సేఫ్టీ లైఫ్ సేవర్స్‌టీం, ఈఎస్ఆర్ అనే గ్రూపును క్రియేట్ చేశామన్నారు. గ్రూపులో పత్రిక విలేకరులు, ప్రభుత్వ వైద్యులు, 108 సర్వీసు, ఆర్ఎంపీలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, సామాజిక వేత్తలతో పాటు ప్రభుత్వ శాఖల మండల అధికారులను చేర్చామని అన్నారు. సబ్ డివిజన్‌లో పరిధిలో ప్రమాదం జరిగినా గ్రూపులో పోస్ట్ చేసి సమాచారం ఇస్తే పోలీసుశాఖ తోపాటు సాయం చేసే చేతులు ముందుకు వస్తాయన్నారు. ఇటీవల జరిగిన తాడ్వాయి-పస్రా రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకులు మృతి చెందిన ప్రాంతంలో సిగ్నల్స్ లేక అంబులెన్స్‌కు సమాచారం అందలేదని అన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాజేడు: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు ఇచ్చిన అసైన్డ్ భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు విక్రాంత్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ సయ్యద్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. 2004 సంవత్సరంలో పేరూరు గ్రామానికి చెందిన 26 మందికి అప్పటి ప్రభుత్వం అసైన్మెంట్ భూములను వ్యవసాయ అవసరాలకు పంపిణీ చేసిందన్నారు. కానీ వారికి పట్టాలను పంపిణీ చేయలేదని తెలిపారు. ప్రస్తుతం వారికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఆదినారాయణ, మహిళలు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ప్రభాకర్, ఎస్‌బీఐ మేనేజర్ ధర్మరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ క్విజ్ పోటీలో మండలంలోని ఏడు పాఠశాలల నుంచి 14 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్ష రాశారు. ఇందులో ప్రథమ బహుమతి మొట్లపల్లి హైస్కూల్, ద్వితీయ బహుమతి కేజీబీవీ కోరికిశాల, తృతీయ బహుమతి మొగుళ్లపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు గెలుపొందారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థి దశ నుంచే ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరం అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కౌన్సిలర్ బుర్ర సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చిట్యాల: విద్యార్థులు ఆర్థిక అక్ష్యరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ కె.సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్ష్యరాస్యత అనే అంశంపై మండల స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యాంక్ మేనేజర్ సురేష్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నైన్‌పాకకు చెందిన అజయ్, భానుప్రసాద్, ద్వితీయ స్థానంలో చిట్యాలకు చెందిన సంజయ్, కె.హాసిని, తృతీయ స్థానంలో కేజీబీవీ విద్యార్థులు సిరివెన్నెల, కె.అంజన నిలిచారు.